నా చెవిలో వూదాడు మావాడు. నన్నడుగుతుం దేమిటి...ఆ దేవికమ్మ ఎవరో నాకేం తెల్సు?' అని బయటికి కూడా అనేశాడు ఆ మణితో.

'ఏమో...ఈ వూళ్లో ఆమెను ఎరుగనివారు లేరు' నిశ్చయంగా చెప్పింది శమంతకమణి.

ఒక జాంబవంతుడు లాంటి లావుపాటి లోపభూయిష్ట మానవుడు మీసాలు దువ్వుకుంటూ టీ త్రాగి, శమంతక మణితో కొంచెం రహస్యంగా ఏదో చెవిలో వూది మోటారు సైకిలుమీద పోయాడు.

ఆ దేవికమ్మ వాళ్ళని ఒక క్షణం విశ్రాంతి తీసుకో నివ్వదు. తన శరీరసుఖమే తప్ప తక్కినవారి సంగతి ఆమెకు పట్టదు. తాను తింటుంది బిస్కట్లు ఊరికే. మేము తినేస్తున్నా మని గోల. పదేళ్ళబట్టి చూస్తున్నా...ఈ మేనేజరు పదవి వదులుకోమని నాకు యిస్తుందేమో అని...యివ్వదు. చచ్చినా...అదే చచ్చినా...దెయ్యంలా వచ్చి ఈ టీ స్టాలులో మేనేజరుగా మీకు టీ యిప్పించి సంతృప్తి పొందుతుంది. ఆం యిదంతా ఎందుకు చెబుతున్నానంటే...మీరు ఆప్తులుగా మంచి అబ్బాయిల్లా కనిపించేరు కనుక!" ఖులాసాగా నవ్వించి శమంతకమణి.

"ముసలిది మనకు సర్టిఫికేటు యించ్చిందిరా" అన్నాడు మావాడు.

"మన బ్రతుక్కి వాళ్లే యిస్తారు. 'నీకారు దండుగ' నీలానా, నేను "

'ఈవేళ డబ్బులేదు. నెలాఖరు...ఒక రూపాయివుంటే యివ్వవూ' అడిగింది శమంతకమణి.

ఆమె మాటలు, ప్రవర్తనా చాలా విచిత్రంగా ఉన్నాయి.

జేబులోంచి ఒక రూపాయి తీసి యిచ్చాను.

వెండి రూపాయి చూడగానే గాజుకన్ను కూడా అదిరింది.

"నేను మీకు ఇంకొక రహస్యం చెప్పనా!"

లేచి నుంచుంది శమంతకమణి.

ఆమెవైపు వింతగా చూచాను.

"మీతో వచ్చాడు ఆయన ఎవరు?'

'నా స్నేహితుడు'

'కాదు' మాట కసిరింది ఆమె.

'మరి ఎవరు?'

'నా అక్కకొడుకు—ఆ సంగతి వాడికే తెలియదు. నీకూ తెలియదు...కాని నాకు తెల్సు...

"నా అక్క నన్ను గుర్తుపట్టదు యిప్పుడు...ఎందుకో తెల్సా...అది సంసారం చేస్తోంది చక్కగా. నేను చెయ్యటం లేదు...అందుకు."

'నిజంగా' నమ్మలాను నేను.

ఎప్పుడైనా టీకి రండి. మీ రూపాయి—ఈ రాత్రి వెలుగురూపాయి—మర్చిపోలేను.

శమంతకమణి లేచి నడిచింది వంతెన రోడ్డుమీద.

